

వలంటీర్లకు నజరానాలు

- పదేసి వేల రూపాయలు పంచుతున్న అధికార పార్టీ ప్రజా ప్రతినిధి
- ఎన్నికల సమయంలో ఓటర్లకు డబ్బు పంపిణీ చేయాల్సి ఉంటుందని వెల్లడి

- 7లో

ఇరువాడలో రియల్టర్ దందా

దర్జాగా మూడు ఎకరాల గెడ్డవాగు ఆక్రమణ



ఇరువాడలో గెడ్డవాగు పోరంబోకును ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించిన దృశ్యం (ఫైల్ ఫొటో)

- అంతకు ముందే జిరాయితీ భూమి కొనుగోలు
- రెండూ కలిపి.. చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం
- సాగునీటి చెరువులకు నీరు వెళ్లలేని పరిస్థితి
- రైతులు ఆందోళన, అధికారులకు ఫిర్యాదు
- సర్వే చేసి.. గెడ్డవాగు ఆక్రమించినట్టు నిర్ధారణ
- అయినా సరే చర్యలు తీసుకోని అధికారులు
- తాజాగా తహసీల్దార్ ఆఫీస్, కలెక్టరేట్ ఎదుట రైతులు ఆందోళన
- స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు
- కబ్జా చేసిన భూమి విలువ సుమారు రూ.18 కోట్లు

సబ్బవరం, మార్చి 11 :
అతనో రియల్టర్. సొంతూరు అనకపల్లి. ప్రస్తుత నివాసం సబ్బవరం. ఇతని సోదరుడు అధికార వైసీపీ నాయకుడు. దీంతో జాతీయ రహదారి పక్కన ఇరువాడ గ్రామంలో గెడ్డవాగు పోరంబోకు భూమిపై కన్ను పడింది. నేరుగా ఆక్రమించుకోవడం వీలుకాదన్న ఉద్దేశంతో పక్కనే వున్న జిరాయితీ భూమిని కొనుగోలు చేశారు. అనంతరం గెడ్డవాగు పోరంబోకు భూమి సుమారు మూడు ఎకరాలను కబ్జా చేసి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. గెడ్డవాగును ఆక్రమించడంతో ఆయకట్టు చెరువులకు నీరు వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తి వెళ్లి పరిశీలించారు. భూ కబ్జాపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వెంటనే సర్వే చేసిన అధికారులు.. మూడు ఎకరాలు కబ్జాకు గురైంది నిర్ధారించారని, కానీ ఇంతవరకు ఆక్రమణలు తొలగించలేదు. దీంతో పలువురు రైతులు సోమవారం సబ్బవరం తహసీల్దారు కార్యాలయం, జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చి, స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా బలిరెడ్డి అప్పారావు, తదితరులు మాట్లాడుతూ.. అనకపల్లికి చెందిన రియల్టర్ కాపుశెట్టి దుర్గాప్రసాద్ ఇరువాడ సర్వే నంబరు 105లో జిరాయితీ భూములను కొనుగోలు చేశారని, దీనికి ఆనుకొని సర్వే నంబర్లు 103, 106లలో 13.36 ఎకరాల గెడ్డవాగు పోరంబోకు భూములు వున్నాయని చెప్పారు. ఎగువన కురిసే వర్షపు నీరు ఈ భూముల మీదుగా మూడు చెరువుల్లోకి వస్తుందని, ఇందులో సుమారు మూడు ఎకరాలను దుర్గాప్రసాద్ ఆక్రమించి

... మిగతా 8వ పేజీలో



కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్న ఇరువాడ గ్రామస్థులు

వైసీపీలో వణుకు!

టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుతో అధికార పార్టీ నేతల్లో గుబులు



- వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం
- ఉద్యోగాలు లేక యువత వలస
- పన్నుల బాదుడుతో జనం విలవిల
- వైసీపీ నేతలు భూ కబ్జాలు, ఇసుక, గ్రావెల్ దందాలు
- మరోసారి అవకాశం ఇస్తే సర్వనాశనమేనని జనం భయం
- ప్రభుత్వ వ్యతిరేక ఓటు గంపగుత్తగా కూటమికి మళ్లుతుందని విశ్లేషకుల అంచనా
- అన్ని నియోజకవర్గాల్లో ఎదురుగాలి తప్పదని వైసీపీ నేతలు ఆందోళన
- 2014లో ఫలితాలు పునరావృతం అవుతాయని జోస్యం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)
సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాక ముందే జిల్లాలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఇప్పటికే టికెట్ ఖరారైన టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులు, అదే విధంగా సమన్వయకర్తలుగా నియమితులైన వైసీపీ నాయకులు సభలు, సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. అయితే తాజా రాజకీయ పరిణామాలు అధికార వైసీపీని కలవరపెడుతున్నాయి. తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య పొత్తు చాలా కాలం క్రితమే ఖరారుకాగా, ఈ రెండు పార్టీలతో బీజేపీ కూడా రెండు రోజుల క్రితం జత కలిసింది. దీంతో వైసీపీ నాయకుల వెన్నులో వణుకు మొదలైంది. 2014 ఎన్నికల ఫలితాలు పునరావృతం అవుతాయా? వచ్చే ఎన్నికల్లో గెలుపుపై ఆశలు వదులుకోవాల్సిందేనా? అని గుబులు చెందుతున్నారు.

జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఎదురు గాలి తప్పదని ఆ పార్టీ సొంత సర్వే సంస్థలే తేల్చేశాయి. దీనికి తోడు వైసీపీ అరాచక పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. దీంతో ఎలాగైనా సరే మరోసారి అధికారాన్ని చేజిక్కించుకోవాలని తహతహలాడుతున్న వైసీపీ నాయకులు ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో వలంటీర్లను అడ్డంపెట్టుకుని రకరకాల తాయిలాలతో ఓటర్లను మభ్యపెడుతున్నారు. మరోవైపు ఎమ్మెల్యేల తీరుపై సొంత పార్టీ నేతలే తీవ్రఅసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చోడవరం, ఎలమంచిలి వంటి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలతో విభేదించి, బహిరంగంగానే ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారు. పలుచోట్ల వైసీపీని వీడి టీడీపీ, జనసేన పార్టీల్లో చేరుతున్నారు. పాయకరావుపేట సమన్వయకర్తగా విజయనగరం జిల్లా నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేను దిగుమతి చేయడంతో స్థానిక నాయకులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అధికార పార్టీ ఇటువంటి క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలో టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య పొత్తు ఖరారవడం సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలను కలవరపాటుకు గురిచేస్తున్నది.

గత ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న అన్ని అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ గెలుపొందగా, ఈసారి సీన్ రివర్స్ అవుతుందని సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీంతో పలువురు అభ్యర్థులను మార్చాలని, కొంతమందిని ఎన్నికలకు దూరంగా వుంచాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. అనకాపల్లి నుంచి గత ఎన్నికల్లో గెలుపొంది, ప్రస్తుతం మంత్రిగా వున్న గుడివాడ అమర్‌నాథ్‌కు టికెట్ లేదన్న విషయం ఇప్పటికే సూచాయగా తెలిసిపోయింది. అనకాపల్లి సమన్వయకర్తగా మలసాల భరత్‌ను నియమించారు. ఇక పాయకరావుపేట సమన్వయకర్తగా విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును నియమించారు. వైసీపీ అధిష్ఠానం తీరుపై ఇక్కడి నేతలు గరంగరంగా వున్నారు. స్థానికులకే టికెట్ ఇవ్వాలంటూ ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కాగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి వైసీపీ పెద్దలు ఇంతవరకు 11 జాబితాలను విడుదల చేశారు. జిల్లాలో నర్సీపట్నం, పెందుర్తి, చోడవరం, ఎలమంచిలి, మాడుగుల నియోజకవర్గాల టికెట్లను సిట్టింగ్ ఎమ్మెల్యేలకే ఇస్తారా? లేకపోతే కొత్తవారిని బరిలోకి దించుతారా? అన్నది స్పష్టం కాలేదు.

2014 ఫలితాలు పునరావృతం అవుతాయా!

రాష్ట్ర విభజన తరువాత 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ కలిసిపోటీ చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో జనసేన పార్టీ నేరుగా ఎన్నికల బరిలో దిగకుండా టీడీపీ-బీజేపీ కూటమికి మద్దతు తెలిపింది. ఆ ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో 11 స్థానాల్లో టీడీపీ, ఒకచోట బీజేపీ విజయం సాధించగా వైసీపీ మూడు స్థానాల్లో గెలుపొందింది. మళ్లీ పదేళ్ల తరువాత

... మిగతా 8వ పేజీలో

బుచ్చెయ్యపేట వైసీపీలో ముదిరిన వర్గపోరు

ఎమ్మెల్యే ధర్మశ్రీ కార్యక్రమానికి పలువురు డుమ్మా



కరణం ధర్మశ్రీ (ఫైల్)



గేదెల సత్యనారాయణ (ఫైల్)

- కోమళ్లపూడిలో పర్యటించిన ఎమ్మెల్యే
- గ్రామ సచివాలయం నూతన భవనం ప్రారంభం
- సొంత ఊరు అయినప్పటికీ హాజరుకాని డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ
- అదే బాటలో ఇద్దరు స్థానిక సర్పంచులు, ఎంపీటీసీ సభ్యురాలు

బుచ్చెయ్యపేట, మార్చి 11:
చోడవరం నియోజకవర్గం బుచ్చెయ్యపేట మండలం కోమళ్లపూడిలో గ్రామ సచివాలయ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా మండల వైసీపీలో నెలకొన్న విభేదాలు మరోసారి బహిర్గతం అయ్యాయి. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, ఇదే గ్రామానికి చెందిన విశాఖ డెయిరీ డైరెక్టర్, సీనియర్ నాయకుడు గేదెల సత్యనారాయణ, సచివాలయం పరిధిలోని కోమళ్లపూడి, గంటికొర్లాం పంచాయతీల సర్పంచులు గేదెల వెంకాయమ్మ, శరకాన గౌరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఒండిగొండ దేవితోపాటు పలువురు నాయకులు ముఖం చాటేశారు.

బుచ్చెయ్యపేట మండలంలో వైసీపీ రెండు వర్గాలుగా విడిపోయింది. ఎమ్మెల్యే ధర్మశ్రీ తమపట్ల పక్షపాతం చూపుతున్నారంటూ పలువురు సీనియర్ నాయకులు సైతం గుర్రుగా వున్నారు. ఇటీవల మండల వైసీపీ అధ్యక్ష పదవి నుంచి కొల్లిమళ్ల అచ్చెంనాయుడును తప్పించడంతో విభేదాలు మరింత ముదిరాయి. అచ్చెంనాయుడును తిరిగి మండల పార్టీ అధ్యక్షుడిగా నియమించాలని విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణతోపాటు ఆయన వర్గీయులు డిమాండ్ చేసినప్పటికీ ఎమ్మెల్యే ధర్మశ్రీ ససేమిరా అన్నారు. అప్పటి నుంచి పార్టీలో వర్గ విభేదాలు బహిర్గతం అయ్యాయి. ఫిబ్రవరి 20వ తేదీన వడ్డాదిలో స్థానిక పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి, ఉప సర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు తదితరులు.. పంచాయతీ పాలనా బాధ్యతలను గ్రామ వైసీపీ అధ్యక్షుడికి కట్టబెట్టి తమను అవమానించారంటూ ఎమ్మెల్యే కె.ధర్మశ్రీపై ధ్వజమెత్తిన విషయం విదితమే. 22వ తేదీన పెదమదీనలో మండల ఎంపీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు దేవర అప్పారావు, రాష్ట్ర కిసాన్ సెల్ కార్యవర్గ సభ్యుడు కొల్లిమళ్ల అచ్చెంనాయుడు, సర్పంచ్‌లు గోకివాడ వరకృష్ణ, తమరాన శ్రీను తదితరులు ఎమ్మెల్యే కె.ధర్మశ్రీపై బహిరంగంగానే విమర్శలు, ఆరోపణలు చేశారు. ఈ విషయం జిల్లా పార్టీ పెద్దల దృష్టికి వెళ్లడంతో విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సమక్షంలో విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయంలో రాజీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మశ్రీ తనపైన, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు వర్గీయుడైన ఎంపీటీసీ సభ్యుడు దేవర అప్పారావు, సర్పంచ్ గోకివాడ వరకృష్ణపైన చెయ్యి చేసుకున్నారని ఫిబ్రవరి 28వ తేదీన వడ్డాదిలో తన అనుయాయులతో నిర్వహించిన సమావేశంలో పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు చెప్పారు. దీంతో మండలంలో వైసీపీ పార్టీగా చీలిపోయింది. జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు వర్గం ఎమ్మెల్యేకు అనుకూలంగా, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ వర్గం ఎమ్మెల్యేకు వ్యతిరేక వర్గంగా విడిపోయారు. దీంతో రాజకీయంగా తనకు ఇబ్బందులు తప్పవని భావించిన ఎమ్మెల్యే ధర్మశ్రీ.. అసమ్మతి వర్గీయులతో రాజీ చర్చలు జరిపారు. కొల్లిమళ్ల అచ్చెంనాయుడును తిరిగి వైసీపీ మండల అధ్యక్షుడిగా నియమిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కానీ ఎంపీపీ దాకవరపు నాగేశ్వరీదేవి అభ్యంతరం తెలిపారు. ఆతనికి (అచ్చెంనాయుడు) మండల పార్టీ పగ్గాలు అప్పగిస్తే తనను పక్కనపెట్టి ఎంపీపీగా ఆయనే చెలామణి అవుతారని ఆరోపించారు. గతంలో అతను మండల పార్టీ అధ్యక్షుడిగా వున్నప్పుడు ఇదే జరిగిందని ఆమె గుర్తు చేశారు. దీంతో సమస్య మళ్లీ మొదకొచ్చింది. దీనికితోడు రాంబాబు, సత్యనారాయణ వర్గీయులు సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పెట్టుకుంటున్న పోస్టులు మరింత అగ్గిని రాజేశాయి. ఈ నేపథ్యంలో కోమళ్లపూడి (విశాఖ డెయిరీ

... మిగతా 8వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.09
సహరి (బుధ)	4.54

ఓటర్లకు తాయిలాలు!

ప్రలోభపెట్టేందుకు వైసీపీ నాయకుల యత్నాలు



- ఇప్పటికే పంపిణీ ప్రారంభం
- స్వీట్లు, చీరలు, డబ్బులు...
- కులాలు, ఇతర సంఘాల నేతలతో రహస్య సమావేశాలు
- ఎన్నికల్లో సహకరించాలంటూ కానుకల పంపిణీ
- తాయిలాలకు పడిపోతే భవిష్యత్తు అంధకారమే
- మంచి నేతను ఎన్నుకుంటేనే మనుగడ అంటున్న నిపుణులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. మరికొద్ది రోజుల్లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజకీయ పార్టీలు సమరానికి సన్నద్ధమవుతున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కొంతమంది ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. ఎలాగైనా విజయం సాధించేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇందులో భాగంగా ఓటర్లకు తాయి లాలు పంచి గెలుపు గుర్రం ఎక్కాలని కొంతమంది ఉవ్విళ్లూరుతున్నారు. వర్గాల వారీగా ప్రజల అవసరాలు గుర్తించి వాటిని తీర్చడం ద్వారా గంపగుత్తగా ఓట్లను కొల్లగొట్టేందుకు ఎత్తులు వేస్తున్నారు.

ఓటర్లను వివిధ రకాలుగా ప్రలోభపెట్టడం, తాయిలాలు అందించి ఆకట్టుకునే చర్యల్లో అధికార వైసీపీ నాయకులు ముందున్నారు. ఇప్పటికే పలువురు అభ్యర్థులు భారీఎత్తున కానుకల పంపిణీని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరిస్తున్న నేతల అనుచరులు... కులాలు, యువజన సంఘాల వారీగా అవసరాలను తెలుసుకుంటున్నారు. వాటిని నెరవేర్చడం ద్వారా ఓట్లను కొల్లగొట్టే వ్యూహాలు రచిస్తున్నారు. ఇందుకోసం ఎంత ఖర్చయినా భరించేందుకు కూడా సిద్ధమవుతున్నారు.

వైసీపీ కానుకల పంపిణీ

ఉమ్మడి విశాఖ జిల్లాలో పలువురు వైసీపీ నాయకులు కానుకల పేరుతో మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్నారు. విశాఖ నగరంలో కొద్దిరోజుల కిందట ఇంటింటికీ స్వీట్ బాక్సులను అందించారు. ఓ కీలక నేత ఓటర్లకు దుస్తులు పంపిణీ చేయడంతో పాటు మహిళలకు చీరలు, ఇతర ఖర్చులకు రూ.500 చొప్పున పంపిణీ చేశారు. ప్రలోభాలకు ఓటర్లు లొంగిపోతే రానున్న రోజుల్లో ఈ నాయకులు మరింత రెచ్చిపోతారనే వాదన వినిపిస్తోంది.

అవసరాలు తెలుసుకుని..

వచ్చే ఎన్నికల్లో విజయం కోసం ప్రయత్నిస్తున్న కీలక నేతలు..వ్యక్తిగతంగా ప్రతి ఓటరును కలుస్తూనే...గంప గుత్తగా పడే ఓట్లపై దృష్టి సారించారు. ఇందుకు కుల, వృత్తి సంఘాలు, అసోసియేషన్లను ఎంచుకుంటున్నారు. ఆయా సంఘాల ముఖ్య నాయకులతో సమావేశమై వారి అవసరాలను తీరుస్తామని, ఎన్నికల్లో సహకరించాలని కోరుతున్నారు. ఇందుకోసం ఒక్కో నేతకు క్షేత్రస్థాయిలో రెండు, మూడు బృందాలు పనిచేస్తున్నాయి. వీరంతా నియోజకవర్గ పరిధిలోని కీలక సంఘాలు, అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశం కావడం, వారి అవసరాలను తెలుసుకుని పోటీలో ఉన్న నేతకు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం విశాఖలోని మూడు నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీ నేతలు ఇదే పనిలో ఉన్నట్టు సమాచారం. ఖర్చుకు వెనుకాడని ఈ నాయకులు యువతపైనా దృష్టిసారిస్తున్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ కిట్లతో వారిని ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

తాయిలాలకు లొంగిపోతే...అంతే!

ఎన్నికల సమయంలో నేతలు పంచే డబ్బు, ఇతర ప్రలోభాలకు లొంగిపోతే ఐదేళ్ల పాటు జీవితం అస్తవ్యస్తమవుతుందనే విషయాన్ని ఓటర్లంతా గుర్తుంచుకోవాలని మేధావులు సూచిస్తున్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే నేతలను ఎన్నుకుంటే మేలు జరుగుతుందని, పిల్లల భవిష్యత్తు మెరుగుపడుతుందని చెబుతున్నారు. ప్రస్తుత పాలకుల హయాంలో కనీస అవసరాలైన నీరు, రోడ్లు, విద్యుత్ తదితర సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతోందా?, అభివృద్ధి పనులు చేపడుతున్నారా?...వంటి విషయాలను పరిగణనలోకి తీసుకుని ఓటు వేయాలంటున్నారు. ప్రలోభాలకు, తాయిలాలకు లొంగిపోయి అసమర్థులను గెలిపిస్తే భవిష్యత్తు అంధకారం అవుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ పరమేశ్వరరావు హెచ్చరిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

- వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి
- 'అనకాపల్లి' ఉమ్మడి అభ్యర్థి కొణతాల పిలుపు

రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి జరగాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుందని అనకాపల్లి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు.

-వార్త 7వ పేజీలో



సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ. వేదికపై బుద్ద నాగజగదీశ్వరరావు, పీలా గోవింద సత్యనారాయణ, తదితరులు

క్రైం... crime news

ఎస్‌బీఐ కాలనీలో చోరీ

అనకాపల్లి టౌన్, మార్చి 11: కొత్తూరు పంచాయతీ పరిధిలోని ఎస్‌బీఐ కాలనీలోని ఒక ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దీనికి సంబంధించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ మహ్మద్ అలీ తెలిపారు. ఎస్‌బీఐ కాలనీలో నివాసముంటున్న పఠాన్ బాజీ షాహిద్ ఈ నెల 9వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి తన స్వగ్రామమైన దేవరాపల్లి మండలం ఎ.కొత్తపల్లి పంచాయతీ సంజీవమెట్టకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి వెనుక తలుపులు తెరిచి వున్నాయి. ఆందోళన చెంది పడక గదిలోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. ఇందులో భద్రపరిచిన రెండున్నర తులాల బంగారం వస్తువులు, రెండు వెండి గ్లాసులు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని నిర్ధారించుకున్న షాహిద్... పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళ నుంచి పది మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, మార్చి 11: కొత్తూరు పంచాయతీ పరిధిలోని ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ వద్ద సత్యనారాయణపురానికి చెందిన కోరిబిల్లి నాగమణి నుంచి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. ఈమె తన వద్ద మద్యం విక్రయిస్తున్నదని, ఇందుకోసం ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యం సీసాలు కొనుగోలు చేసి తీసుకెళుతుండగా తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు.

దలాయిపాలెంలో..

పరవాడ, మార్చి 11: మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీ దలాయిపాలెం గ్రామానికి చెందిన ఎస్ఎస్ పడియార్ నుంచి ఆదివారం రాత్రి పది క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బాల సూర్యారావు తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి కొనుగోలు చేసి తీసుకెళుతుండగా నిఘా వేసి పట్టుకున్నట్టు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

నక్కపల్లి, మార్చి 11: మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన ఒక వివాహిత ఆదివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సీఐ విజయ్ కుమార్ సోమవారం ఆ గ్రామానికి వెళ్లి ఆరా తీశారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు... రాజయ్యపేట గ్రామానికి చెందిన వాసుపల్లి రాజుకు మద్యం సేవించే అలవాటు వుంది. ఈ వ్యసనాన్ని మానుకోవాలని భార్య సింహాచలం పలుమార్లు కోరింది. అయినా అతను వినలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సింహాచలం డీజిల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకోవడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

దేవీనగర్‌లో దారుణం

- రుబ్బురోలుతో అత్తను కొట్టిన కోడలు
- తీవ్రగాయాలతో మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 11: పట్టణానికి ఆనుకుని వున్న కొత్తూరు పంచాయతీ దేవీనగర్‌లో సోమవారం దారుణం చోటు చేసుకుంది. అత్తాకోడళ్ల మధ్య జరిగిన గొడవ పెద్దదై ఒక ప్రాణం తీసింది. కోడలు రుబ్బురోలు సన్నిగొడ్డతో తలపైన, ముఖం పైన బలంగా మోదడంతో అత్త మృతిచెందింది. ఈ సంఘటనకు సంబంధించి పట్టణ సీఐ జి.శంకరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు పంచాయతీ దేవీనగర్‌కు చెందిన ఈగల సన్యాసిరావు, సింహాద్రమ్మ(65) దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అందరికీ వివాహాలయ్యాయి. కుమారుడు గణేశ్ తుమ్మపాలకు చెందిన పూర్ణను 2007లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం వీరికి ఒక బాబు, ఒక పాప ఉన్నారు. తండ్రి, కొడుకు ఒకే ఇంటిలో పక్క పక్క గదుల్లో కుటుంబాలతో కలిసి నివాసం వుంటున్నారు. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న గణేశ్ సోమవారం ఉదయం విధులకు వెళ్లిపోయాడు. వీరి పిల్లలను స్కూల్‌కు దిగబెట్టేందుకు ఉదయం 8.30 గంటల సమయంలో సన్యాసిరావు పట్టణంలోకి వెళ్లారు. ఈ సమయంలో అత్త, కోడలు మధ్య గొడవ జరిగింది. ఇదికాస్తా ముదరడంతో పూర్ణ రుబ్బురోలు సన్నిగొడ్డతో సింహాద్రమ్మ తల, ముఖం మీద బలంగా కొట్టింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి స్పృహతప్పి పడిపోయింది. అనంతరం పూర్ణ బయటకు వెళ్లిపోయింది. ఇదే సమయంలో ఇంటికి వస్తున్న సన్యాసిరావు.. రోడ్డుపై వెళుతున్న కోడలు పూర్ణను ఎంత పిలిచినా ఆగలేదు. అప్పటికే సింహాద్రమ్మ కేకలకు చుట్టుపక్కల వారు వచ్చారు. ఇంటిలోపలికి వెళ్లిన సన్యాసిరావు, రక్తపుమడుగులో పడివున్న భార్యను చూసి 108కు ఫోన్ చేసి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కానీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. ఇదిలావుండగా అత్త, కోడలు మధ్య కొంతకాలం నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల దిశ మహిళా పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లడంతో పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ చేశారు. అయినా గొడవ పడడం ఆపలేదని తెలిసింది. మృతురాలి భర్త సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిందితురాలు పూర్ణ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.



సింహాద్రమ్మ (ఫైల్ ఫొటో)

వలంటీర్లకు నజరానాలు

- పదేసి వేల రూపాయలు పంచుతున్న అధికార పార్టీ ప్రజా ప్రతినిధి
- ఎన్నికల సమయంలో ఓటర్లకు డబ్బు పంపిణీ చేయాల్సి ఉంటుందని వెల్లడి

అనకాపల్లి, మార్చి 11: అనకాపల్లి జిల్లాలో అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధి ఒకరు తన ప్రధాన అనుచరుల ద్వారా గత మూడు రోజులుగా వలంటీర్లకు నగదు నజరానాగా పంపిణీ చేయిస్తున్నారు. రోజుకు మూడు నుంచి నాలుగు పంచాయతీల వలంటీర్లను నియోజకవర్గ పరిధిలో గల అధికార పార్టీకి చెందిన నాయకుని అతిథి గృహానికి రమ్మంటున్నారు. వలంటీర్‌లు గెస్ట్ హౌస్ వద్దకు వెళ్లిన వెంటనే మొత్తం తనిఖీ చేస్తున్నారు. సెల్ ఫోన్‌లు తీసుకొని గెస్ట్‌హౌస్‌లోనికి పంపుతున్నారు. ఒక్కొక్క వలంటీర్‌కు రూ.పది వేలు ఇస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పూర్తి సహకారం అందించాలని చెబుతున్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో ఓటుకు ఇంత అని తాము ఇస్తామని, వాటిని ఓటర్లకు పంపిణీ చేయాల్సి ఉంటుందని కూడా చెబుతున్నారు. ఓటర్లకు పంచడానికి డబ్బులు చేతికే ఇస్తామని, అందరికీ సక్రమంగా చేరాలని...అవకతవకలకు పాల్పడితే తర్వాత దారుణమైన చర్యలుంటాయని కూడా హెచ్చరించినట్టుట్టు తెలిసింది. డబ్బులు తీసుకొని బయటకు వచ్చిన తరువాత సెల్‌ఫోన్ తిరిగి ఇస్తున్నారు. నియోజకవర్గంలో రెండు మండలాలకు చెందిన వలంటీర్లకు నగదు పంపిణీ పూర్తయ్యిందని, మరో రెండు మండలాల వలంటీర్లకు ప్రారంభమయ్యిందని తెలిసింది.

బాడీ బిల్డింగ్ పోటీల్లో జిల్లాకు ప్రథమ స్థానం

కొత్తూరు (అనకాపల్లి), మార్చి 11: సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో అనకాపల్లి జిల్లాకు చెందిన బాడీ బిల్డర్ సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచినట్టు జిల్లా బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరపల్లి కృష్ణాజీ, శిలపరశెట్టి బాబీ తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో కర్ణాటక రాష్ట్రం దావణగెరెలో జరిగిన సౌత్ ఇండియా డ్రీమ్స్ క్లాసిక్ బాడీ బిల్డింగ్ పోటీల్లో చోడవరం ప్రాంతానికి చెందిన ఎన్.ఎం.మారునాయుడు 80 కేజీల విభాగంలో మొదటి స్థానం సాధించాడని చెప్పారు. నిర్వాహకులు రూ.50 వేల నగదుతోపాటు అవార్డు అందజేశారని తెలిపారు. కాగా పంజాబ్‌లో ఈ నెల 16, 17 తేదీల్లో జరగనున్న జాతీయ పోటీల్లో మారునాయుడు పాల్గొననున్నట్టు రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్వామి రమేశ్, వి.శ్రీనివాసరాజు తెలిపారు.



బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మారునాయుడు

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

ఎంజేపురంలో గ్రావెల్ దోపిడీ

- ఉపాధి పనులు మాటున అక్రమ తవ్వకాలు
- దర్జాగా అమ్ముకుంటున్న అధికార పార్టీ నేతలు
- పట్టించుకోని రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది



రోడ్డు పనుల కోసం గ్రావెల్ తవ్వుతున్న ఉపాధి కూలీలు

అచ్యుతాపురం, మార్చి 11: ఉపాధి పనులు మాటున అధికార పార్టీ నాయకులు గ్రావెల్ దోపిడీకి పాల్పడుతున్నారు. సెలవు రోజుల్లో, రాత్రి వేళల్లో కొండవాలు ప్రదేశంలో యంత్రాలతో గ్రావెల్ తవ్వి తరలించుకుపోతున్నారు. ఈ విషయం ఉపాధి హామీ పథకం అధికారులకు, స్థానిక రెవెన్యూ సిబ్బందికి తెలిసినప్పటికీ, గ్రావెల్ తవ్వుకుపోతున్నది వైసీపీ మద్దతుదారులు కావడంతో పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



ఎంజేపురంలో ఒక ఖాళీ స్థలంలో తోలిన గ్రావెల్

అచ్యుతాపురం మండలం ఎంజేపురం గ్రామానికి ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు మంజూరయ్యాయి. అయితే కొన్ని వీధులు లోతట్టుగా వుండడంతో తొలుత గ్రావెల్‌తో ఎత్తుచేసి, అనంతరం సిమెంట్ కాంక్రీట్ వేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం గ్రామానికి ఆనుకుని వున్న కొండవాలు ప్రదేశంలో గ్రావెల్ తవ్వడానికి పంచాయతీ అధికారులు అనుమతులు ఇచ్చారు. గ్రావెల్‌తోపాటు వచ్చే రాళ్లను కూడా వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు. కొద్ది రోజుల క్రితం ఉపాధి కూలీలతో గ్రావెల్ తవ్వి, సీసీ రోడ్లు వేసే వీధుల్లోకి తరలిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన స్థానిక అధికార పార్టీ నాయకులు రాత్రిపూట, సెలవు రోజుల్లో కొండవాలు ప్రదేశంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ట్రాక్టర్లలోకి లోడింగ్ చేసి భవన నిర్మాణాల్లో పునాదులు నింపడానికి, ఖాళీ స్థలాలను ఎత్తు చేయడానికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రావెల్ తవ్వేటప్పుడు వచ్చే రాళ్లను అక్కడే వదిలేస్తున్నారు. ఉపాధి కూలీలు గ్రావెల్‌తోపాటు రాళ్లను కూడా సీసీ రోడ్ల పనులకు వినియోగిస్తున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాల గురించి వీఆర్వోకు, పంచాయతీ సిబ్బందికి తెలిసిన పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

సచివాలయ ఉద్యోగినిపై సర్పంచ్ ఆగ్రహం

- తనకు సమాచారం ఇవ్వకుండా సెలవు ఎలా పెట్టావని నిలదీత
- విధులకు హాజరుకాకుండా కొంత సేపు అడ్డగింత
- గాంధీగ్రామం సచివాలయం వద్ద ఘటన

చోడవరం, మార్చి 11: సచివాలయ ఉద్యోగినిపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ఆమె కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్న అధికార పార్టీకి చెందిన సర్పంచ్ తీరు వివాదాస్పదమైంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. గాంధీగ్రామం సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఈశ్వరసాయి సోమవారం ఉదయం సచివాలయానికి హాజరయ్యారు. అప్పటికే అక్కడ ఉన్న ఆ పంచాయతీ అధికార పార్టీకి చెందిన సర్పంచ్ గాడి అప్పారావు వేచి ఉన్నారు. ఆమె విధులకు హాజరుకాకుండా అడ్డుకున్నారు. తనకు సమాచారం ఇవ్వకుండా సెలవు ఎందుకు పెట్టావని నిలదీశారు. తనకు ఆరోగ్యం బాగోలేదని దీనిపై పంచాయతీ కార్యదర్శి, ఎండీవోకు సమాచారం ఇచ్చి సెలవు పెట్టానని ఆమె తెలిపారు. అయినా ఆమె కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆమె కంటతడి పెట్టుకున్నారు. కొంత సమయం తరువాత ఆమె విధులకు హాజరయ్యారు. దీనిపై సర్పంచ్ వివరణ కోరగా ఇళ్ల లబ్ధిదారులు నెల రోజుల నుంచి బిల్లులు అప్‌లోడ్ చేయాలని సచివాలయం చుట్టూ తిరుగుతున్నారని, వారికి ఎవరూ సమాధానం చెప్పడం లేదన్నారు. సచివాలయ ఉద్యోగుల పనితీరు బాగోలేదని, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి బిల్లులు ఆగిపోతే ఎవరు సమాధానం చెబుతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు ఎవరికి నచ్చిన సమయంలో వారు వస్తున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పడం లేదని తెలిపారు. సర్పంచ్‌కి కనీస విలువ ఇవ్వడం లేదని ఆయన చెప్పారు.



సచివాలయం వద్ద ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ అప్పారావు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

- వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి
- 'అనకాపల్లి' ఉమ్మడి అభ్యర్థి కొణతాల పిలుపు

అనకాపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి జరగాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుందని అనకాపల్లి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఒక ప్రైవేటు కళ్యాణ మండపంలో జరిగిన టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనవల్ల అభివృద్ధి కుంటుపడిందని, అందువల్ల రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరారవు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో అన్ని రంగాలు కుదేలయ్యాయని ఆరోపించారు. నాయకులెవరూ భేషిజాలకు పోవద్దని, అనకాపల్లిలో ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం మూడు పార్టీల శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని కోరారు. పీలా గోవింద మాట్లాడుతూ, రాష్ట్రంలో భావితరాల బాగు కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడాల్సి వచ్చిందన్నారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రి చేయాలన్నదే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అనకాపల్లి టౌన్, కశింకోట, అనకాపల్లి మండలాలకు చెందిన నాయకులు, ముఖ్యకార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

మోదీ మళ్లీ ప్రధాని కావడం ఖాయం

- కొణతాల రామకృష్ణ

కొత్తూరు, మార్చి 11: దేశంలో నరేంద్ర మోదీ గాలి వీస్తోందని, ఆయన మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక చదువుల వారి వీధిలో ఉన్న బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిమూర్తులైన మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలవడంతో రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, డాక్టర్ విక్రమ్, గంటి అప్పారావు, గంగుపాం నాగేశ్వరరావు, కొణతాల అప్పలరాజు, ఉగ్గిన రమణమూర్తి, గొంతిన శ్రీనివాసరావు, శ్రీరామదాసు గోవింద పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారానికి కృషి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ప్రజల నుంచి 246 వినతులు స్వీకరణ

తుమ్మపాల (అనకాపల్లి), మార్చి 11: స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించడానికి కృషి చేయాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డీఆర్‌ఓ బి.దయానిధితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 246 అర్జీలు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, స్పందనలో అందిన వినతులను పరిష్కరించలేకపోతే అందుకుగల కారణాలను అర్జీదారులకు లిఖితపూర్వకంగా తెలియపరచాలన్నారు. కాగా ల్యాండ్ పూలింగ్‌లో తమ భూములను బలవంతంగా తీసుకున్నారని, అభివృద్ధి చేసిన స్థలాలను ఇంతవరకు తమకు అప్పగించలేదని పాపయ్యపాలెం గ్రామానికి చెందిన పలువురు స్పందనలో ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో స్థలాలు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా అధికార పార్టీ నాయకులు రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేసి తన భూములను ఆక్రమించారని పాయకరావుపేటకు చెందిన గాబు దొరయ్య ఫిర్యాదు చేశారు. గతంలో పలుమార్లు స్పందనలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఎ స్‌వీఎస్‌సుబ్బలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొంతమంది సమస్యలను స్వయంగా ఆలకించి, న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. స్పందన కార్యక్రమంలో 28 అర్జీలు అందాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలకు సంబంధించినవి అధికంగా వున్నాయి. ప్రతి అర్జీని పరిష్కరించేలా చొరవ చూపాలని, వీటిపై నిర్ణీత గడువులోగా ఏ చర్యలు తీసుకున్నారో నివేదికలు అందించాలని పోలీసు అధికారులకు సూచించారు.

వైసీపీ పాలనలో సర్పంచులకు కష్టాలు

- నిధులు, విధులు లేక ఉసూరు
- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నాతవరం, మార్చి 11: వైసీపీ పాలనలో సర్పంచులకు కష్టాలు తప్పడం లేదని, నిధులు, విధులు లేక ఉసూరుమంటున్నారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఎన్నికల శంఖారావంలో భాగంగా సోమవారం రాత్రి గన్నవరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ సర్పంచులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను ముఖ్యమంత్రి జగన్ దారి మళ్లిస్తున్నారని, దీంతో వైసీపీకి చెందిన సర్పంచులు కూడా బాధపడుతున్నారని పేర్కొన్నారు. తాండవ ఎత్తిపోతల పథకానికి ముఖ్యమంత్రి జగన్ రూ.470 కోట్లతో శంకుస్థాపన చేసి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ నిధులు మంజూరు చేయలేదన్నారు. నర్సీపట్నం నియోజకవర్గ జనసేన నాయకుడు రాజాన వీరసూర్యచంద్ర మాట్లాడుతూ సచివాలయాల నిర్మాణానికి వాడే సిమెంట్ బస్తాలను వైసీపీ నాయకులు మాయం చేస్తున్నారన్న విషయాన్ని మండల సమావేశంలో వైసీపీకి చెందిన ఎంపీపీ లక్ష్మణమూర్తే స్వయంగా చెప్పారని పేర్కొన్నారు. నాతవరం మండలంలో 11 లేఅవుట్లను ఎందుకు రద్దు చేశారో చెప్పాలన్నారు. మాజీ ఎంపీపీ సింగంపల్లి సన్యాసిదేముడు మాట్లాడుతూ గన్నవరంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 13 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. అనంతరం శృంగవరం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభలో అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నర్సీపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అచ్చిరాజు, మాజీ ఎంపీపీ ఎస్.విజయ్‌కుమార్, తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.



గన్నవరం సభలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

రూ.2 వేల కోట్లతో అనకాపల్లి- ఆనందపురం రహదారి

- ఆరు వరుసలు...50.8 కి.మీ. పొడవు
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ



అనకాపల్లి- ఆనందపురం నడుమ ఆరు వరుసల రహదారి

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నగరానికి ట్రాఫిక్ తాకిడి తగ్గించడానికి జాతీయ రహదారి-16లో భాగంగా అనకాపల్లి-ఆనందపురం మధ్య నిర్మించిన ఆరు వరుసల రహదారి నిర్మాణం ఏడాది క్రితం పూర్తయింది. దీనిని మంగళవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అనకాపల్లి నుంచి సబ్బవరం, పెందుర్తి మీదుగా ఆనందపురం వరకు నిర్మించిన ఈ రహదారి పొడవు 50.8 కిలోమీటర్లు. ఆరు వరుసల్లో నిర్మించిన ఈ రహదారి నిర్మాణానికి రూ.2 వేల కోట్లు వెచ్చించారు. వాస్తవానికి ఇది 2021లోనే పూర్తి కావలసి వుండగా కరోనా కారణంగా ఆలస్యమైంది. ఏడాది కాలంగా ఈ రహదారిపై రాకపోకలు సాగుతున్నాయి. ఈ మార్గంలో 21 అండర్ బ్రిడ్జిలు, 2 రైల్వే వంతెనలు, మరో 10 సాధారణ వంతెనలు, 52 బాక్స్ ఆకారంలో కల్వర్టులు, వివిధ గ్రామాలను హైవేతో కలుపుతూ 25 అప్రోచ్ రోడ్లు, 44 కల్వర్టులు నిర్మించారు. సబ్బవరం, పెందుర్తిల వద్ద ఇంటర్ చేంజ్ జంక్షన్లు ఏర్పాటుచేశారు.

ఇంటర్ పరీక్షలకు 11,586 మంది విద్యార్థులు హాజరు

అనకాపల్లి టౌన్, మార్చి 11: జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం మేథ్స్-2/ జువాలజీ/ హిస్టరీ పరీక్షలకు సోమవారం 11,586 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి సుజాత తెలిపారు. మొత్తం 11,943 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వుందని, అయితే 357 మంది హాజరుకాలేదని ఆమె పేర్కొన్నారు.

సీఎం నోట అబద్ధాల వరద!

- ప్రజలను మభ్యపెట్టడానికి జగన్‌రెడ్డి యత్నం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపణ

అనకాపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం వైసీపీ నిర్వహించిన 'సిద్ధం' సభలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎప్పటిమాదిరిగానే అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఒక ప్రకటనలో విమర్శించారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 85 శాతం అమలు చేశామని చెప్పుకోవడం ఆయనకే చెల్లిందన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఉద్యోగుల సీపీఎస్ రద్దు, అంగన్‌వాడీలకు తెలంగాణలో కన్నా అదనంగా వేతనాలు చెల్లింపు, విద్యుత్ చార్జీలు తగ్గింపు, మద్య నిషేధం అమలు.. ఇలా ఎన్నో హామీలను అమలు చేయకుండా జగన్మోహన్‌రెడ్డి మాట తప్పారని ధ్వజమెత్తారు. ఇసుక, గ్రావెల్, మట్టి.. అన్ని రకాల ప్రకృతి వనరులను దోచుకుంటున్న వైసీపీ పాలకులు రానున్న ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు ప్రజల వద్దకు వెళితే నిలదీసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని, దీంతో సిద్ధం సభలకు బలవంతంగా ప్రజలను తరలిస్తున్నారని పేర్కొన్నారు.

ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం

- డీపీఆర్‌వో డి.సాయిబాబా

తుమ్మపాల, మార్చి 11 : ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకమని డీపీఆర్‌వో డి.సాయిబాబా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాలానికి అనుగుణంగా మీడియాలో పలు మార్పులు వస్తున్నాయని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకుల ఉపన్యాసాలు కొత్తరూపం సంతరించుకుంటున్నాయని చెప్పారు. జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి జి.గోవిందరావు మాట్లాడుతూ, రాజకీయ పార్టీల ప్రకటనలకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల శిక్షణా కార్యక్రమాల కో-ఆర్డినేటర్ జయంతి, ఎంసీఎంసీ సభ్యులు నిర్మలా దేవి, గిరీశ్‌రెడ్డి, ఇంద్రావతి, నాగమణి, సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిబాబా

అయోధ్యకు యువకుడు సైకిల్ యాత్ర



అయోధ్యకు సైకిల్ యాత్ర ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, మార్చి 11: అచ్యుతాపురం నుంచి అయోధ్యకు ఒక యువకుడు సైకిల్ యాత్ర చేస్తున్నాడు. సోమవారం మండలంలోని కొల్లివానిపాలెంకి చెందిన పైల మణీంద్ర (26) స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఒకపక్క 1,700 కిలోమీటర్లు వస్తుంది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సాధించాలనే ఉద్దేశంతో ఒక్కడినే సైకిల్‌పై అయోధ్యకు వెళ్తున్నానని మణీంద్ర తెలిపారు. కార్యక్రమంలో కోన బుజ్జి, కూండ్రపు వెంకునాయుడు, వడిసెల శ్రీనివాసరావు, నర్మాల కుమార్, భీముని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రామాలయానికి రూ.1.5 లక్షలు విరాళం



మామిడివాడ పెద్దలకు విరాళాన్ని అందజేస్తున్న దొరస్వామి

రాంబిల్లి, మార్చి 11 : మండలంలోని మామిడివాడ శివారు చిన్నకలవలపల్లిలో రామాలయంలో విగ్రహాలు ఏర్పాటుకు బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ భారతీయ భాగస్వామి దొరస్వామి సోమవారం రూ.1.5 లక్షలను గ్రామ పెద్దలకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దొరస్వామి మాట్లాడుతూ సీతారాముల ఆలయం నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పలనర్స, ఎంపీటీసీ సభ్యుడు సేనాపతి సన్యాసిరావు, పెద్దలు బి.భాస్కరరావు, కె.మహాలక్ష్మి, కె.సత్యనారాయణ, కె. కాశీసత్యనారాయణ ఉన్నారు.

ఉమ్మడి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి

» ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాస్



టీడీపీ కరపత్రాలను అందజేస్తున్న భీమరశెట్టి శ్రీనివాస్

ఎస్.రాయవరం, మార్చి 11: మండల కేంద్రంలో ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాస్, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు కోమిరెడ్డి నాగమణితో కలిసి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో రాష్ట్రం సర్వనాశనం అయిపోయిందని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాడెల సంతోష్, అంకబత్తుల రమణ, పీతన శివశంకర్ పాల్గొన్నారు.

సమరసత ఫౌండేషన్ మండల కన్వీనర్‌గా ముత్తా

ఎస్.రాయవరం, మార్చి 11: సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్‌గా కొరుప్రోలు గ్రామానికి చెందిన ముత్తా గోవిందరావును నియమించినట్లు ఫౌండేషన్ ఉత్తరాంధ్ర జోనల్ ధర్మప్రచారక్ ఆడారి గంగాధర్ తెలిపారు. సోమవారం కశింకోట మండలం పరవాడపాలెంలో జరిగిన జిల్లా సమావేశంలో రాష్ట్ర ప్రముఖ్ కొండారెడ్డి, జిల్లా సంయోజక్ చంద్ర మాలకొండయ్య సమక్షంలో గోవిందరావుకు ఫౌండేషన్ కండువా కప్పి మండల కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు. గోవిందరావు నియామకం పట్ల గోవిందరాజు, పిల్లి శ్రీరాములు, పోతు రంగారావు, కట్టా వీరబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

తల్లుల చేతుల్లో ఆరోగ్య భారత్ : సీడీపీవో

సబ్బవరం, మార్చి 11 : ఆరోగ్య భారతవని తయారు చేయడం తల్లుల చేతుల్లోనే ఉందని సబ్బవరం సీడీపీవో లలిత కుమారి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం జరిగిన పోషణ్ పక్కాడా కార్యక్రమంలో ఆమె ప్రసంగిస్తూ- బిడ్డల సంరక్షణలో తల్లులే కీలకపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కొల్లి కృష్ణ, ఆర్.పైడితల్లి, అంగన్‌వాడీలు ఎం.చినతల్లి, వై.సత్యవతి, కేవీ రత్నకుమారి పాల్గొన్నారు.

'రిక్షా కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి'

తుమ్మపాల, మార్చి 11 : తమను ప్రభుత్వం ఆదుకోవాలని రిక్షా కార్మికుల సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ స్పందనలో రిక్షా కార్మికులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ప్రభుత్వం స్పందించి ప్రతి ఏటా కనీసం రూ. 20వేలు ఆర్థిక సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రిక్షా కార్మిక సంఘాల నాయకులు గురంపల్లి వెంకటరావు, అప్పారావు, నీలకంఠం, డేవిడ్, జగ్గారావు, నారాయణ, చిన్నారావు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా బడ్జెట్ ఆమోదం

నక్కపల్లి,మార్చి 11: స్థానిక మండల పరిషత్ బడ్జెట్ సమావేశం సోమవారం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన నిర్వహించారు. 2023-24 సంవత్సరం సవరణ బడ్జెట్, 2024-25 అంచనా బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 66,92,92,800 అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. మహిళా శిశు సంక్షేమం, సామాజిక భద్రతా సంక్షేమం, గ్రామీణ ఉపాధి, ప్రజా పనులు, జీతభత్యాలు, ఎస్సీ, ఎస్టీ కేటాయింపులతో బడ్జెట్‌ను రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సీతారామరాజు, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

29 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

ఎలమంచిలి, మార్చి 11: మండలంలోని జంపపాలెం గ్రామంలో 29 క్వార్టర్ మద్యం సీసాలతో అదే గ్రామానికి చెందిన మణికంఠను సోమవారం అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

కొత్తూరు, మార్చి 11: అనకాపల్లి మండలం మామిడిపాలెం మీదుగా 15 మద్యం క్వార్టర్ బాటిళ్లను తరలిస్తున్న నారంశెట్టి వెంకట్రావును అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్ఐ చెప్పారు.

అగ్రిగోల్డ్ బాధితుల ర్యాలీని జయప్రదం చేయాలి

తుమ్మపాల, మార్చి 11 : అగ్రి బాధితులకు డిపాజిట్‌లను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న అగ్రిగోల్డ్ బాధితుల బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కరణం మాణిక్యాలరావు పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన ఆరు నెలల్లో అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చి తుంగలోకి తొక్కారన్నారు. సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం, సభ్యులు పొలమరశెట్టి శేషు, జెర్రిపోతుల దుర్గారావు, సూరిబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటల్లో తగ్గిన 'పేట' ఆదాయం

» అధికారుల ఎదుటే రింగైన పాటదారులు
» అప్‌సెట్ ప్రైస్ కంటే రూ.17వేలు తగ్గిన రోజువారీ ఆశీల వేలం పాట
» మరో రెండు వేలం పాటలు వాయిదా

పాయకరావుపేట, మార్చి 11 : పాయకరావుపేటలో సోమవారం నిర్వహించిన రోజువారీ ఆశీల వసూలు వేలం పాటలో పాటదారులు రింగవడంతో పంచాయతీ ఆదాయం భారీగా తగ్గింది. పంచాయతీకి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న రోజువారీ ఆశీల వసూలు వేలం వరుసగా మూడో ఏడాది కూడా తగ్గిపోయిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రోజువారీ మార్కెట్ ఆశీలు, మేకల కబేలా, చేపల మార్కెట్, చెట్ల ఫలసాయంలకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. వీటిలో రోజువారీ మార్కెట్ ఆశీల వేలం పాటకు రూ.6.82 లక్షలు అప్‌సెట్ ప్రైస్ నిర్ణయించిన అధికారులు రూ.6.5 లక్షల నుంచి వేలం పాట ప్రారంభించగా అధికారుల ఎదుటే పాటదారులు బయటకు వెళ్లిపోయి మంతనాలు జరుపుకుని, రూ.6.65 లక్షలకు యిరిగుల శ్రీలేఖ పాడుకున్నారు.



వేలం పాటలు నిర్వహిస్తున్న దృశ్యం



కార్యాలయం బయట రింగవుతున్న పాటదారులు

అదేవిధంగా మేకల కబేలా ఆశీలు వసూలు గతేడాది కంటే రూ.2వేలు పెరిగి రూ.50వేలకు ఖరారైంది. ఇక రిటైల్ చేపల మార్కెట్, చెట్ల ఫలసాయం వేలం పాటలు అప్‌సెట్ ప్రైస్ కంటే తక్కువకు వెళ్లడంతో వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ మాట్లాడుతూ రోజువారి ఆశీల వేలం అప్‌సెట్ ప్రైస్ కంటే తక్కువకు పాట వెళ్లిన కారణంగా అనుమతి కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. రిటైల్ చేపల మార్కెట్, చెట్ల ఫలసాయం వేలం పాటలను వాయిదా వేశామని చెప్పారు.

వరుసగా మూడో ఏడాది తగ్గిన ఆదాయం

రోజువారీ మార్కెట్ ఆశీలు వేలం పాటలో పాటదారులు రింగయిన కారణంగా వరుసగా మూడో ఏడాది కూడా పంచాయతీ ఆదాయం తగ్గింది. వాస్తవానికి 2020-21లో రోజువారీ ఆశీల వసూలు వేలం పాట రూ.7.1 లక్షలకు వెళ్లగా, 2021-22లో కరోనా కారణం చూపడంతో రూ.6.3 లక్షలకు తగ్గింది. ఆ తరువాత 2022-23 సంవత్సరానికి నిర్వహించిన వేలంలో పాటదారులు రింగవడంతో రూ.6.5 లక్షలకు పాడుకున్నారు. అదేవిధంగా గతేడాది కూడా పాటదారులు రింగవడంతో రూ.6.55 లక్షలకు పాట ఖరారవగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సోమవారం నిర్వహించిన వేలం పాట కూడా పాటదారులు రింగవడంతో పంచాయతీకి ఈ ఏడాది కూడా ఆదాయం తగ్గిందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలని సీపీఎం ఆందోళన

అనకాపల్లి టౌన్, మార్చి 11 : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్‌బీఐ ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఎస్‌బీఐ వద్ద సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలు ఎస్‌బీఐ అందజేసేలా సుప్రీంకోర్టు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, ఆర్. శంకరరావు, అల్లు రాజు, బి. ఉమామహేశ్వరరావు, కె.తేలయ్యబాబు, కె.ఈశ్వరరావు, ఎస్.రమణ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో.. ఎన్నికల బాండ్ల వివరాలు ఎస్‌బీఐ బహిర్గతం చేయాలని సీపీఎం కన్వీనర్ రొంగలి రాము డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ వద్ద ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో కె.సోమునాయుడు, కె. అప్పారావు, నాయుడు, కనకారావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బీఐ ప్రకటించాలంటూ అడ్డరోడ్డు ఎస్‌బీఐ ఎదుట సోమవారం సీపీఎం మండల కన్వీనర్ ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, త్రిమూర్తులు, రమణ, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో.. ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలని సీపీఎం, సీపీఐ కార్యకర్తలు సోమవారం స్థానిక ఎస్‌బీఐ వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, సీపీఐ, సీపీఎం నాయకులు, ఐద్వా నాయకులు డీడీ వరలక్ష్మి, నాగమణి, శ్రీదేవి, అమ్మాజీ పాల్గొన్నారు.



అనకాపల్లి ఎస్‌బీఐ ఎదుట నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

నక్కపల్లిలో.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే బయటపెట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు వద్ద సీపీఎం నేతలు ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేశ్ మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధమైన, అప్రజాస్వామికమైన ఎన్నికల బాండ్లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.భూలోక, బి.నూకరాజు, సీహెచ్ సోమేశ్, ఎం.లోవరాజు, ఎం.బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం : ప్రగడ

మునగపాక (తుమ్మపాల), మార్చి 11 : అధిష్ఠానం ఆదేశాల మేరకు టీడీపీ శ్రేణులంతా నడుచుకోవాలని ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఫోన్ చేసి అవసరమైతే అసెంబ్లీ సీటును జనసేనకు కేటాయించాల్సి వస్తుందని, నాయకులంతా సహకరించాలని కోరినట్టు చెప్పారు. కార్యకర్తలంతా టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా కార్యకర్తలంతా పనిచేయాలని సూచించారు. గత ఐదేళ్లలో టీడీపీ కార్యకర్తలు ఎదుర్కొన్న సమస్యలను అధిష్ఠానం గుర్తించాలని



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

పలువురు నాయకులు విన్నవించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, నాయకులు ఆడారి మంజు, మొల్లేటి సత్యనారాయణ, రాజశేఖర్, డొక్కా నాగభూషణం, కడియం అనురాధ, ఆడారి జానకి తదితరులు పాల్గొన్నారు.

పందూరు వంతెనకు శంకుస్థాపన ఎన్నికల స్టంట్

» తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత

కోటవురట్ల, మార్చి 11: మండలంలోని పందూరులో వరహానదిపై వంతెన నిర్మాణానికి అధికార వైసీపీ నాయకులు శంకుస్థాపన చేయడం ఎన్నికల స్టంట్ అని తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత విమర్శించారు. సోమవారం ఆమె వైసీపీ నాయకులు వేసిన శిలాఫలకం వద్ద విలేకర్లతో మాట్లాడుతూ 2015 మార్చి 5వ తేదీన పందూరు వంతెన నిర్మాణానికి అయ్యన్నపాత్రుడుతో కలిసి తాను శంకుస్థాపన చేశామన్నారు. నిర్మాణ పనులు పిల్లర్స్ స్థాయి వరకు పూర్తయ్యాయని, ఎస్టిమేషన్ ఎక్కువ కావడంతో నిధులు మంజూరు చేసే సమయంలో 2019 ఎన్నికలు రావడం, జగన్ ప్రభుత్వం రావడంతో పందూరు వంతెన మధ్యలో ఆగిపోయిందన్నారు. మరో మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న తరుణంలో ఆదరాబాదరగా వంతెన శంకుస్థాపనకు మరో శిలాఫలకం వేయడం ఏమిటని అనిత ప్రశ్నించారు. వైసీపీ నాయ



పందూరు వంతెనకు వైసీపీ నేతలు వేసిన కొత్త శిలఫలకాన్ని చూపిస్తున్న అనిత

కులకు చిత్తశుద్ధి ఉంటే మంగళవారం నుంచి పనులు ప్రారంభించాలని ఆమె డిమాండ్ చేశారు. ఆమె వెంట టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, నాయకులు సుంకర్ బాబ్జి, తిరుమలరావు తదితరులు ఉన్నారు.

పలు గ్రామాల్లో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

కోటవురట్ల, మార్చి 11: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రాజాం ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అన్నవరంలో హెల్త్‌సెంటర్, రామచంద్రపాలెంలో ఆర్‌బీకే, సామాజిక, హెల్త్ సెంటర్ భవనాలు, కె.వెంకటాపురంలో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు, నీలిగుంటలో కమ్యూనిటీ హాలును ప్రారంభించారు. అనంతరం చౌడువాడలో ఆర్‌బీకే, సచివాలయం భవనాలు, పందూరులో హెల్త్‌సెంటర్, వంతెనకు పెండింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ వరదు కల్యాణి, ఏపీఎంఎస్ఎంఈ చైర్మన్ డీవీ సూర్యనారాయణరాజు, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సాగి సీతబాబు, ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి, వైసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పైల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పందూరులో వంతెనకు శంకుస్థాపన చేస్తున్న వైసీపీ నాయకులు

ఆవఖండంలో అక్రమ లేఅవుట్‌లపై చర్యలేవి : బాలేపల్లి

తుమ్మపాల, మార్చి 11 : అనకాపల్లి సౌత్-2 రెవెన్యూ పరిధిలోని ఆవఖండంలో రియల్టర్లు వేస్తున్న అక్రమ లేఅవుట్‌లపై అధికారులు చర్యలెందుకు తీసుకోలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ప్రశ్నించారు. సీపీఐ నాయకులతో కలిసి సోమవారం ఆవఖండంలో అక్రమ లేఅవుట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చని పంట పొలాలతో కళకళలాడే ఆవఖండంలో ప్రస్తుతం రియల్ దందా కొనసాగుతుందన్నారు. కళ్ల ముందు అక్రమాలు సాగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. అధికారులు మొద్దు నిద్ర వీడి పనులను నిలుపుదల చేయాలని, లేదంటే అఖిలపక్ష నాయకులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజాన దొరబాబు, వైఎస్ భద్రం, కోరిబిల్లి శంకరరావు, తాకాశి వెంకటేశ్వరరావు, ముక్కమల చిన్ని, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



ఆవఖండంలో భూముల్లో రోడ్లు పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

వైసీపీలో వణుకు!

... 5వ పేజీ తరువాయి

టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలో దిగుతున్నాయి. అప్పట్లో వైసీపీ కొత్తగా ఏర్పడిన పార్టీ కావడం, తొలిసారి సాధారణ ఎన్నికల్లో పోటీ చేస్తుండడంతో ప్రజల నుంచి అంతగా వ్యతిరేకత లేదు. అయినప్పటికీ ఉమ్మడి జిల్లాలో మూడు స్థానాలే ఆ పార్టీకి దక్కాయి. వీటిల్లో ఒక్క మాడుగుల మాత్రమే ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో వుంది. ఈసారి వైసీపీ పరిస్థితి మరింత దయనీయంగా వుంది. ఐదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధి మూడు దశాబ్దాలు వెనక్కుపోయిందన్న ప్రతిపక్షాల ఆరోపణలను జనం బలంగా నమ్ముతున్నారు. రహదారుల దుస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కలేదు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేశారు. కొత్త పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటు కాకపోవడంతో నిరుద్యోగ యువత వేరే రాష్ట్రాలకు వలసపోవాల్సిన దుస్థితి నెలకొంది. దీనికితోడు వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో కుడి చేత్తో రూపాయి ఇచ్చి, పన్నుల రూపంలో ఎడమ చేతితో పది రూపాయలు లాగేసుకుంటున్నదని ప్రజలకు స్పష్టమైంది. ఇదిలావుంచితే అధికార పార్టీ నేతల భూ ఆక్రమణలు, ఇసుక, గ్రావెల్ దందాల గురించి ఎంత చెప్పినా తక్కువే! మొత్తం మీద వైసీపీకి మరోసారి అవకాశం ఇస్తే తమ బతుకులు నాశనం అవుతాయని మెజారిటీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేయకూడని ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. కాగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తుండడంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు గంపగుత్తంగా ఈ పార్టీల అభ్యర్థులకు పడే అవకాశం వుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఈసారి ఎన్నికల్లో వైసీపీకి గట్టి దెబ్బతగలడం ఖాయమని అంటున్నారు.

'బుచ్చెయ్యపేట' వైసీపీలో ముదిరిన వర్గపోరు

... 5వ పేజీ తరువాయి

డైరెక్టర్ గేదెల సత్యనారాయణ స్వగ్రామం)లో సోమవారం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ హాజరైన సచివాలయ నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సత్యనారాయణతోపాటు కోమళ్లపూడి, గంటికొర్లాం సర్పంచులు గేదెల వెంకాయమ్మ, శరకాన గౌరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఒండిగొండ దేవి, తదితరులు వర్గీయులు బహిష్కరించారు. దీంతో వైసీపీలో విభేదాలు మరింత ముదిరాయి.

పేకాట ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు

ఎలమంచిలి, మార్చి 11: మండలంలోని తురంగలపాలెం సమీపంలో సోమవారం పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. వీరి నుంచి రూ.2,600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీ సేవలు అభినందనీయం : అదీప్‌రాజ్

పరవాడ, మార్చి 11: నిర్వాసిత గ్రామాల్లో సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రశంసించారు. సింహాద్రి సీఎస్ఆర్ నిధులు రూ.35లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.నాలుగు లక్షలతో పరవాడ, కలపాక ప్రాథమిక పాఠశాలల్లో నిర్మించిన అదనపు భవనాలను సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, సింహాద్రి జీఎంలు బీబీ పాత్ర, శ్రీమంత మహాపాత్ర, సీఎస్ఆర్ మేనేజర్ ప్రకాశరావు, సర్పంచ్ బొండా కనకారావు పాల్గొన్నారు.

మహిళలకు సమాన హక్కు ఉండాలి

అనకాపల్లి టౌన్, మార్చి 11 : మహిళలకు సమాన హక్కు ఉండాలని ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం వాసవీక్లబ్ వనితా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు జంగాల ఫణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇరువాడలో రియల్టర్ దందా

... 5వ పేజీ తరువాయి

ప్రహరీ గోడ నిర్మించాడని ఆరోపించారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా సమగ్ర భూసర్వేలో భాగంగా ఇరువాడలో కూడా సర్వే చేసిన అధికారులు.. సర్వే నంబర్లు 103, 106లలో 13.36 ఎకరాల గెడ్డవాగు పోరంబోకు భూములు వున్నాయని గుర్తించారని చెప్పారు. అయినా సరే ఆక్రమణలను తొలగించలేదన్నారు. ఈనేపథ్యంలో మూడు నెలల క్రితం మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ శ్రేణులతో కలసి రియల్టర్ ఆక్రమించిన భూములను పరిశీలించారని, భూ కబ్జాపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారని గుర్తు చేశారు. వెంటనే సర్వే చేసిన అధికారులు.. మూడు ఎకరాలు కబ్జాకు గురైంది నిర్ధారించారని, కానీ ఆక్రమణలను తొలగించలేదన్నారు. హైవేకి ఆనుకొని వున్న ఈ భూమి విలువ సుమారు రూ. 18 కోట్లు ఉంటుందన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి కబ్జాకు గురైన గెడ్డవాగు పోరంబోకు భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గ్రూపు ఫొటో తీయించుకున్న పూర్వ విద్యార్థులు

అనకాపల్లి టౌన్, మార్చి 11 : స్థానిక గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 1978-79 సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం సాయంత్రం శ్రీనివాస కల్యాణ మండపంలో జరిగింది. 46 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు కుటుంబసభ్యులతో కలుసుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా 60 ఏళ్లు వచ్చినందున కొందరికి షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఒకరికొకరు కుటుంబసభ్యుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బీఎస్ఎంకే జోగినాయుడు, కేవీఎస్ ప్రకాశ్, దొడ్డి జగదీశ్వరరావు, కాండ్రేగుల శంకరరావు, మధు, పీలా అచ్యుతరామారావుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

శ్రీచైతన్యలో కుటుంబ పండగ

అనకాపల్లి టౌన్, మార్చి 11 : స్థానిక రింగురోడ్డులోని శ్రీచైతన్య స్కూల్ స్కూల్‌లో సోమవారం కుటుంబ పండగ జరిగింది. విద్యార్థినీ విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ రీజనల్ ఇన్‌చార్జి ఏ.రమణ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు కుటుంబ విలువల గురించి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీవీ కమల్‌కుమారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్ష

అనకాపల్లి టౌన్, మార్చి 11 : స్థానిక కోర్టు వద్ద అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ రిలే నిరాహారదీక్షను కొనసాగిస్తున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని న్యాయవాదులు దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు సీనియర్ న్యాయవాది కేవీఆర్ నాయుడు, ఎంజేవీఎస్ కుమార్ మద్దతు పలికారు.

మహిళా శక్తితోనే దేశం ముందడుగు

» విశాఖ ఫార్మాసిటీ ఎండీ లాల్‌కృష్ణ

పరవాడ, మార్చి 11 : మహిళా శక్తితోనే దేశం ముందడుగు వేస్తుందని విశాఖ ఫార్మాసిటీ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఫార్మాసిటీ హబ్‌లో గల సమావేశమందిరంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు రాంకీ ఎంపవరింగ్ విమెన్స్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న రంగాల్లో విశేష ప్రతిభను కనబరిస్తూ మహిళలు తమ ఉనికిని నిరూపించుకుంటున్నారన్నారు. రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు రామిరెడ్డి మాట్లాడుతూ మహిళలను మించిన ప్రేరణ శక్తి మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ ప్రతినిధులు యర్రయ్య, గిరిధరరావుభక్షి, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు కె.శ్రీకాంత్, శ్రీనివాసారెడ్డి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలి

ఎలమంచిలి, మార్చి 11: ఎలమంచిలి రైల్వేస్టేషన్‌లో 9 నెలలుగా రద్దు చేసిన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని ప్రయాణికుల సంక్షేమ సంఘం ప్రతినిధి కె.సత్యనారాయణ ప్రకటనలో కోరారు. ప్రత్యేక సెజ్, నేవల్ బేస్ వంటి ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టులు ఈ ప్రాంతంలో ఉన్నాయని, వీటిలో విధులు నిర్వహించే ఉద్యోగులు, కార్మికులు, నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ మంజూరు చేయాలని కోరారు. స్టేషన్‌లో ప్రశాంతి, కోణార్క్, బెంగళూరు వీక్లీ మెయిల్ వంటి ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ మంజూరు చేయాలన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ చేస్తున్న మండల సమైఖ్య ప్రతినిధులు

ఎలమంచిలి, మార్చి 11 : మండలంలోని లైనుకొత్తూరు మండల సమైఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహించినట్టు డీఆర్‌డీఏ ఏపీవో రాణి తెలిపారు. సోమవారం మండల సమైఖ్య ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సిబ్బంది, సమైఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రసవాలు పీహెచ్‌సీలోనే చేయించాలి

రాంబిల్లి, మార్చి 11 : ప్రసవాలు పీహెచ్‌సీలోనే జరిగేట్టు చూడాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యులు ఆర్.వెంకటేష్, ఎస్‌బీసీ శ్రావణి అన్నారు. సోమవారం పీహెచ్‌సీ సిబ్బంది అందిస్తున్న ఆరోగ్య సేవలపై వారు సమీక్షించారు. ప్రజలు వాడుతున్న ఉప్పులో అయోడిన్ శాతం పరీక్షలు నిర్వహించేందుకు శాంపిల్స్ సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి ఎస్ఎస్‌వీఎస్.రాజు, ఆరోగ్య పర్యవేక్షకులు జి. ఉమామహేశ్వరి, సీహెచ్ ధనరాజు, ఎంఎల్‌హెచ్‌సీలు, ఏఎన్ఎంలు ఉన్నారు.

వైసీపీ నేతపై చర్యలు తీసుకోవాలి

» భట్లపూడి గ్రామస్థుల డిమాండ్

తుమ్మపాల, మార్చి 11 : అనకాపల్లి మండలం భట్లపూడి పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 1లో వైసీపీ నాయకులు అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నారని ఆ గ్రామ టీడీపీ, జనసేన నాయకులు ఆరోపించారు. ఆ భూములను విక్రయిస్తూ కోట్లాది రూపాయలు అక్రమార్జనకు పాల్పడుతున్నారని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించి, జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ నాయకుడు గొంతిన సత్యారావు మాట్లాడుతూ వైసీపీ నాయకులు గ్రామంలో బరితెగించి భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పందూరి మురళీ, గండిబోయిన సత్యనారాయణ, వి. వెంకటరావు, చంద్రరావు పాల్గొన్నారు.

దుప్పితూరులో పలు భవనాలు ప్రారంభం

అచ్యుతాపురం, మార్చి 11: మండలంలోని దుప్పితూరులో నూతనంగా నిర్మించిన సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, ఆర్‌బీకే భవనాలతోపాటు సీసీ రోడ్లను వైసీపీ నేతలు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు, కోన బుజ్జి, వడిసెల శ్రీనివాసరావు, నర్మాల కుమార్, దొరబాబు, బలిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

మునగపాక (తుమ్మపాల), మార్చి 11 : మండలంలోని నారాయుడుపాలెంలో షార్టు సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదం జరిగి సర్వం కోల్పోయిన ఎలమంచిలి రవితేజ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని యాదవ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, పది వేల రూపాయలు తక్షణ సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భరణికాన బాబూరావు, సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి సబ్బి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు భరణికాన నరసింహమూర్తి, నాయకులు బోరా సోమునాయుడు, మొల్లి ప్రసాద్, బంధం వెంకటరమణ, లండా అప్పన్న, మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

నేడు పరదేశమాంబ అమ్మవారి పండగ

పరవాడ, మార్చి 11 : మండల కేంద్రంలో పరదేశమాంబ అమ్మవారి పండగను మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయం వద్ద నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

అంతా మీ వల్లే...!

» గ్రామాల్లో ప్రజలకు సమాధానం చెప్పుకోలేకపోతున్నాం » మరీ ఇంత అధ్వానంగా పనిచేస్తే ఎలా..?
» రెవెన్యూ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారుల పనితీరు ఘోరం
» చోడవరం, బుచ్చెయ్యపేట మండలాల సర్వ సభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధులు ఆగ్రహం

భూముల రీ సర్వేతో తప్పులు మరింత పెరిగిపోయాయి

» ఉన్న విస్తీర్ణం కూడా చాలామంది పాసు పుస్తకాల్లో నమోదు కాలేదు
» చోడవరం మండల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆరోపణ



విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పంచాయతీ సర్పంచ్‌లు

చోడవరం, మార్చి 11 : 'గ్రామాల్లో మీ వల్ల ప్రజలకు సమాధానం చెప్పుకోలేకపోతున్నాం.. ఇంత అధ్వానంగా పనిచేస్తే ఎలా..' అని ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారుల పనితీరుపై నిప్పులు చెరిగారు. ఎంపీపీ గాడి కాసు కాసు అధ్యక్షతన ఏర్పాటైన ఈ సమావేశానికి విప్ ధర్మశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో తొలుత పలువురు సభ్యులు మండలంలో జరిగిన భూముల రీ సర్వే అంతా తప్పులతడకగా జరిగిందని, దీనివల్ల అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకుని వచ్చారు. రీ సర్వే జరిగితే తప్పులు సరిచేస్తారని ఆశిస్తే, మరిన్ని తప్పులు పెరిగాయని వారంతా ఆరోపించారు. ఉన్న విస్తీర్ణం కూడా చాలామంది పాసు పుస్తకాల్లో నమోదు కాలేదని, దీనివల్ల మళ్లీ వారంతా రెవెన్యూ సిబ్బంది చుట్టూ తిరగాల్సి వస్తున్నదని తహసీల్దార్ వేణుగోపాలరావుకు వివరించారు. నరసాపురం పంచాయతీ పరిధిలో అక్రమంగా దుకాణాలు నిర్మించారని, భూముల ఆక్రమణలు కూడా జరుగుతున్నాయని ఆ పంచాయతీ ప్రజాప్రతినిధులు ఆరోపించారు. గ్రామాల్లో వీఆర్‌వోలు, సర్వేయర్లు తమకు అందుబాటులో ఉండడం లేదని, ఇలాగైతే పంచాయతీ సర్పంచ్‌లుగా తాము ఉండడం దేనికంటూ సర్పంచ్‌లు తహసీల్దార్‌ను నిలదీశారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేలో తప్పులు దొర్లితే దానికి పూర్తి బాధ్యత సంబంధిత వీఆర్‌వోలదేనన్నారు. ఎక్కడైనా తప్పులు దొర్లితే వాటిని సరిదిద్దిస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం పలువురు సభ్యులు విద్యుత్ శాఖ పట్టణ, గ్రామీ ఏఈలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జన్నవరం తదితర పంచాయతీల్లో విద్యుత్ వైర్లు ఇళ్లపై వేలాడుతున్నాయంటూ ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా, పట్టించుకోవడం లేదని వాపోయారు. విద్యుత్ సమస్యలను అధికారులు పట్టించుకోకపోతే సర్పంచ్‌లుగా తాము ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. విద్యుత్ శాఖ అధికారుల తీరువల్ల తమకు చెడ్డపేరు వస్తుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అంకుపాలెం పరిధిలోని సీతమ్మ చెరువులో ఆక్రమణలు పెరిగాయని, వెంటనే తొలగించాలని అక్కడి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రమామణి, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్ధ గంగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు తదితరులతో పాటు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిలు వెయ్యకముందే పరిస్థితి బాగుండేది

» కొన్నిచోట్ల కనెక్షన్లు సరిగా లేవు.. మరిన్నిచోట్ల అసంపూర్తిగా వేశారు
» బుచ్చెయ్యపేట మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆవేదన



బుచ్చెయ్యపేట సమావేశంలో అధికారులను నిలదీస్తున్న పోలేపల్లి సర్పంచ్ పైడినాయుడు

బుచ్చెయ్యపేట, మార్చి 11 : అధికారుల పనితీరుపై బుచ్చెయ్యపేట మండల ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. ఆద్యంతం సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. ఇంటింటి కళాయి కనెక్షన్లు సక్రమంగా, పూర్తిస్థాయిలో వేయకపోవడంతో ప్రజల ఆగ్రహావేశాలను తాము చూడవలసి వస్తున్నదని దిబ్బిడి, పోలేపల్లి, నీలకంఠాపురం, ఆర్.భీమవరం, వడ్డాది, ఆర్.శివరామపురం సర్పంచ్‌లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ హరీష్‌పై నిలపులు చెరిగారు. ఇంటింటి కొళాయిలు వేయకపోతేనే తమ పరిస్థితి బాగుండేదని వారు వాపోయారు. దిబ్బిడిలో 30 పాయింట్‌లు వేయలేదని, నీలకంఠాపురంలో వాటర్ ట్యాంకు ప్రారంభించలేదని, వేసిన పైప్ లైన్ లీకేజ్‌లు కావడంతో నీరు అందడం లేదని, ఆర్.భీమవరం జగనన్న కాలనీలో ట్యాంకు నిర్మించికపోవడంతో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, అలాగే చినభీమవరంలో ట్యాంకు నిర్మాణం చేపట్టాలని, అప్పంపాలెం, తురకలపూడి, చిట్టియ్యపాలెంలలో పైపులైన్లను నిర్మించకపోవడంతో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్‌లు పి.మాణిక్యం, సీతా పైడినాయుడు తదితరులు వాపోయారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు కోమళ్లపూడిలో వేసిన నాలుగు తాగునీటి బోర్లను, కొంతమంది వ్యవసాయ సాగుకు మార్చుకుని విద్యుత్ మోటార్లు వేసుకుని వ్యక్తిగతంగా వినియోగించుకుంటున్నారని జడ్పీటీసీ దొండా రాం బాబు ఆరోపించారు. వడ్డాదిలోని జగనన్న ఇళ్ల కాలనీ పట్టాల మంజూరులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, అనర్హులకు మంజూరైన పట్టాలపై విచారణ చేపట్టి వాటిని రద్దు చేయాలని రాంబాబు డిమాండ్ చేశారు. భూముల రీసర్వే లోపభూయిష్టంగా జరగడంతో రికార్డులు తప్పుల తడకగా మారాయని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని పోలేపల్లి సర్పంచ్ సీతా పైడినాయుడు తెలిపారు. ఆర్.శివరామపురం, నీలకంఠాపురంలో జిరాయితీ భూములు 22ఏ జాబితాలో చేరడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారని సర్పంచ్‌లు పేర్కొన్నారు. లింగభూపాలపుర అగ్రహారంలో జరిగిన ఉపాధి పనుల్లో అవినీతి చోటుచేసుకుందని, పనిలోనికి రాని కూలీల పేర్లు మీద వీఆర్పీ రూ.లక్షన్నర అవినీతికి పాల్పడాడని సర్పంచ్ తమరాన శ్రీను ఆరోపించారు. దీంతో అతనిని తప్పించాలని కోరగా, ఉపాధి అధికారులు ఏకంగా గ్రామంలో ఉపాధి పనులనే నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా సమావేశానికి 22 శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాల్సి ఉండగా, 12 శాఖల నుంచి మాత్రమే హాజరు కావడంపై సభ్యులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో తాను చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులతో పాటు ఆయా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయం తథ్యం'



మాజీ మంత్రి అయ్యన్నతో భేటీ అయిన జనసేన నాయకులు

నర్సీపట్నం అర్బన్, మార్చి 11 : మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుతో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు సోమవారం ఇక్కడ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడాలన్న లక్ష్యంతో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పనిచేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, నాయకులు అద్దెపల్లి గణేష్, సహదేముడు, మోపాడ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

'బ్రిటీష్ సైనికాధికారుల సమాధుల స్థలం కాపాడండి'



ఆర్డీవో జయరాంకు వినతిని అందిస్తున్న వీరభద్రరావు

నర్సీపట్నం అర్బన్, మార్చి 11 : పట్టణంలో బ్రిటీష్ సైనికాధికారుల సమాధుల స్థలం ఆక్రమణ కాకుండా చర్యలు చేపట్టాలని అల్లూరి సీతారామరాజు జాతీయ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు కోరారు. ఈ మేరకు ఆర్డీవో జయరాంకు సోమవారం ఇక్కడ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు జి.గురుబాబు, శివంగి నాగేశ్వరరావు, పోతిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'బుచ్చెయ్యపేట' వైసీపీలో ముదిరిన వర్గపోరు

... 5వ పేజీ తరువాయి

డైరెక్టర్ గేదెల సత్యనారాయణ స్వగ్రామం)లో సోమవారం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ హాజరైన సచివాలయ నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సత్యనారాయణతోపాటు కోమళ్లపూడి, గంటికొర్లాం సర్పంచులు గేదెల వెంకాయమ్మ, శరకాన గౌరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఒండిగొండ దేవి, తదితరులు వర్గీయులు బహిష్కరించారు. దీంతో వైసీపీలో విభేదాలు మరింత ముదిరాయి.

ఇరువాడలో రియల్టర్ దందా

... 5వ పేజీ తరువాయి

ప్రహరీ గోడ నిర్మించాడని ఆరోపించారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా సమగ్ర భూసర్వేలో భాగంగా ఇరువాడలో కూడా సర్వే చేసిన అధికారులు.. సర్వే నంబర్లు 103, 106లలో 13.36 ఎకరాల గెడ్డవాగు పోరంబోకు భూములు వున్నాయని గుర్తించారని చెప్పారు. అయినా సరే ఆక్రమణలను తొలగించలేదన్నారు. ఈ నేపథ్యంలో మూడు నెలల క్రితం మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ శ్రేణులతో కలసి రియల్టర్ ఆక్రమించిన భూములను పరిశీలించారని, భూ కబ్జాపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారని గుర్తు చేశారు. వెంటనే సర్వే చేసిన అధికారులు.. మూడు ఎకరాలు కబ్జాకు గురైంది నిర్ధారించారని, కానీ ఆక్రమణలను తొలగించలేదన్నారు. జాతీయ రహదారికి ఆనుకొని వున్న ఈ భూమి విలువ సుమారు రూ. 18 కోట్లు ఉంటుందన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి కబ్జాకు గురైన గెడ్డవాగు పోరంబోకు భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

వైసీపీలో వణుకు!

... 5వ పేజీ తరువాయి

టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలో దిగుతున్నాయి. అప్పట్లో వైసీపీ కొత్తగా ఏర్పడిన పార్టీ కావడం, తొలిసారి సాధారణ ఎన్నికల్లో పోటీ చేస్తుండడంతో ప్రజల నుంచి అంతగా వ్యతిరేకత లేదు. అయినప్పటికీ ఉమ్మడి జిల్లాలో మూడు స్థానాలే ఆ పార్టీకి దక్కాయి. వీటిల్లో ఒక్క మాడుగుల మాత్రమే ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో వుంది. ఈసారి వైసీపీ పరిస్థితి మరింత దయనీయంగా వుంది. ఐదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధి మూడు దశాబ్దాలు వెనక్కుపోయిందన్న ప్రతిపక్షాల ఆరోపణలను జనం బలంగా నమ్ముతున్నారు. రహదారుల దుస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కలేదు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేశారు. కొత్త పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటు కాకపోవడంతో నిరుద్యోగ యువత వేరే రాష్ట్రాలకు వలసపోవాల్సిన దుస్థితి నెలకొంది. దీనికితోడు వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో కుడి చేత్తో రూపాయి ఇచ్చి, పన్నుల రూపంలో ఎడమ చేతితో పది రూపాయలు లాగేసుకుంటున్నదని ప్రజలకు స్పష్టమైంది. ఇదిలావుంచితే అధికార పార్టీ నేతల భూ ఆక్రమణలు, ఇసుక, గ్రావెల్ దందాల గురించి ఎంత చెప్పినా తక్కువే! మొత్తం మీద వైసీపీకి మరోసారి అవకాశం ఇస్తే తమ బతుకులు నాశనం అవుతాయని మెజారిటీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేయకూడదని ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. కాగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తుండడంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు గంపగుత్తంగా ఈ పార్టీల అభ్యర్థులకు పడే అవకాశం వుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఈసారి ఎన్నికల్లో వైసీపీకి గట్టి దెబ్బతగలడం ఖాయమని అంటున్నారు.

జగన్ పాలనలో అన్ని వ్యవస్థలు సర్వనాశనం

» రాష్ట్రం బాగుపడాలన్నా.., ప్రజల కష్టాలు తీరాలన్నా.. చంద్రబాబు వంటి సమర్థుడు అవసరం » అమ్మపేట ఎన్నికల శంఖారావం సభలో విజయ్



అమ్మపేట సభలో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

గొలుగొండ, మార్చి 11 : రాష్ట్రంలో వైసీపీ సర్కారు అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ దుయ్యబట్టారు. మండలంలోని అమ్మపేట గ్రామంలో సోమవారం రాత్రి ఎన్నికల శంఖారావం సభలో మాట్లాడారు. ప్రధానంగా సాగునీటి వనరులపై జగన్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందన్నారు. నదులు, జలాశయాలు, గెడ్డలు, సాగునీటి చెరువుల మరమ్మతుకు అవసరమైన నిధులు కేటాయించక పోవడంతో కొన్నిచోట్ల పంటలు పండే పరిస్థితి లేదన్నారు. దీంతో ఆయా ప్రాంత రైతులు గగ్గోలు పెడుతున్నారన్నారు. పంటలు పండినచోట్ల సైతం గిట్టుబాటు ధరలు కరువయ్యాయన్నారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ రాష్ట్ర ప్రగతి పథాన పయనించాలన్నా, ప్రజల కష్టాలు తీరాలన్నా చంద్రబాబునాయుడు వంటి సమర్థ నాయకత్వం అవసరమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ శ్రేణులంతా ఎన్నికలు పూర్తయ్యే వరకు అనుక్షణం అప్రమత్తంగా ఉండడంతో పాటు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నిద్ర దేముడునాయుడు, నాయకులు గొర్లి రవి, గొర్లి సత్తిబాబు, గొర్లి వెంకటరమణ, శ్రీను తదితరుతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోర్టులో ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవంలో పాల్గొన్న జడ్జిలు, న్యాయవాదులు

చోడవరం, మార్చి 11 : ఇక్కడి కోర్టుల ప్రాంగణంలో చోడవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా మహిళా జడ్జిలు సత్తి అరుణశ్రీ, పి.ప్రదీప, వసంత రమణమ్మ, మహిళా న్యాయవాదులు కందర్ప అన్నపూర్ణ, గొర్లె కృష్ణవేణి, వెంకట మంజుల, నళిని, సుబ్బలక్ష్మి, భారతి, అపర్ణ, సత్యవతి, పద్మావతి, శ్యామల, గౌరి, జ్యోతి, రజనీకాంతిలను, కోర్టులో మహిళా సిబ్బందిని ఘనంగా సత్కరించారు. తొమ్మిదవ అడిషనల్ జిల్లా జడ్జి కె.రతన్‌కుమార్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు బలగాలు ఫ్లాగ్ మార్చ్



పోలేపల్లిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న బలగాలు

బుచ్చెయ్యపేట, మార్చి 11 : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛగా ఓటును వినియోగించుకునేలా పోలీసులు శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. బుచ్చెయ్యపేట, వడ్డాది, దిబ్బిడి, పోలేపల్లి, కందిపూడి, రాజాం తదితర గ్రామాల్లో కవాతు జరిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని, ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరించే వారికి తగిన చర్యలు తప్పవని సందేశం ఇచ్చేందుకే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. బుచ్చెయ్యపేట ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.8.8 లక్షలకు సంతలో ఆశీల వసూలు పాట ఖరారు

మాడుగుల, మార్చి 11 : మండల కేంద్రం మాడుగులలో ప్రతి సోమ, గురువారాల్లో జరిగే సంతల్లో ఆశీల వసూళ్లకు సంబంధించి సోమవారం వేలం పాట నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ ప్రక్రియకువివిధ ప్రాంతాల నుంచి 14మంది హాజరయ్యారు. ఒక్కొక్కరు రూ.రెండు లక్షలు చొప్పున డిపాజిట్ చేసి పాల్గొన్నారు. తొలుత సర్కారి వారి పాట రూ.9.6 లక్షలుగా ప్రకటించారు. దీంతో ఇదివరలో వలే రాబడి లేకపోతే నష్టపోతామని భావించి పాట పాడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. చివరకు చేసేది లేక గత ఏడాది వలే పాట ప్రారంభించగా, మాడుగులకు చెందిన గొర్లి సూర్యనారాయణ రూ.8.8 లక్షలకు పాట పాడుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యడ్ల కళావతి, కార్యదర్శి చీపురుపల్లి నాయుడు, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, బొమ్మిశెట్టి శ్రీను, జవ్వాది వరహాలు, సయ్యపురెడ్డి సత్తిబాబు, సమ్మంగి జగన్ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'లో 15 మంది అర్జీలు సమర్పణ

నర్సీపట్నం అర్బన్, మార్చి 11 : ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పదిహేను మంది విచ్చేసి అర్జీలను సమర్పించారు. అందరితో ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట సంతలో చింతపండుకు గిట్టుబాటు ధర

కృష్ణాదేవిపేట, మార్చి 11 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో సోమవారం జరిగిన వారపు సంతలో చింతపండుకు మంచి ధర పలకడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సంతకు బంగారంపేట, రాజపేట, కొత్తపల్లి, భీమవరం, అంతాడ తదితర గ్రామాల నుంచి గిరిజన రైతులు వందల కిలోల చింతపండును తట్టలతో తెచ్చారు. ఈ ఏడాది చింతపండు దిగుబడి తక్కువగా ఉండడంతో వ్యాపారులు పోటీపడిమరీ కొనుగోలు చేశారు. ఇరవై కిలోలు బరువు ఉండే బుట్టు రూ.1,000, 30కిలో బరువుగల చింతపండు బుట్ట రూ.1,500లకు కొనుగోలు చేశారు. దీంతో మంచి ధర లభించిందని రైతులు తెలిపారు.

నేడు వరహాపురంలో గంగాదేవి గావుపండగ



చీడికాడ, మార్చి 11 : మండలంలోని వరహాపురంలో గంగాదేవి గావుపండగను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఐదేళ్లకు ఒక సారి జరగనున్న ఈ వేడుకకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. వేకువ జాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

మారుజాతి కలప మాయంపై అటవీ శాఖ విచారణ



కృష్ణాదేవిపేట ఇటుకబట్టీ వద్ద కలపను పరిశీలిస్తున్న అధికారులు

కృష్ణాదేవిపేట, మార్చి 11 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట, కొండగోకిరి, పాత కృష్ణాదేవిపేటలలో గల ఇటుక బట్టీల్లో సోమవారం ఉత్తరాంధ్ర స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం బృందం తనిఖీలు నిర్వహించారు. చింతాలమ్మ, రంపుల ఘాట్ రోడ్డు అనుకుని రాజమండ్రి నుంచి కృష్ణాదేవిపేట మీదుగా విజయనగరం 516 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మార్కింగ్‌కి మించి 94 మారుజాతి చెట్లు నరికినట్లు కృష్ణాదేవిపేట, పెదవలస రేంజ్ అధికారులకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ తనిఖీలు జరిపారు. కాకరపాడు రేంజ్ పరిధిలో 35 మారుజాతి చెట్లు, బంగారంపేట సెక్షన్ పరిధిలో 59 మారుజాతి చెట్లను స్మగ్లర్లు నరికి తరలించుకు పోయినట్టు గుర్తించారు. కృష్ణాదేవిపేట పరిసర ప్రాంతాల్లో ఎనిమిది ఇటుక బట్టీల వద్ద బృందం సభ్యులు తనిఖీలు చేపట్టగా రెండు బట్టీల వద్ద 40సీఎంటీ మారుజాతి చెట్లు చివర్లు కలప గుర్తించారు. వీటిపై ఆరా తీసి కేసు నమోదు చేశారు. ఇంకా నల్ల మద్ది, ఎగిస, ఆషీస్ తదితర విలువైన కలప ఏమైయిందని విచారణ జరిపారు.

అనంతరం చింతాలమ్మ ఘాట్ రోడ్డులో మార్కింగ్‌కు మించి నరికిన చెట్ల మొదళ్ల కొలతలు తీశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణపడాల్, యలమంచిలి, ఆర్‌వీ నగర్ సబ్ డీఎఫ్‌వోలు సునీల్‌కుమార్, ఎస్ఎస్‌బీ రాజు, స్థాక, స్క్వాడ్ రేంజ్ అధికారులు సుంకర వెంకటరావు, గంగరాజు, జగదీష్, భార్గవవర్మ పాల్గొన్నారు.

'బహుముఖం' మొదటి పాట విడుదల



పాటను విడుదల చేస్తున్న కళాశాల అధ్యాపక బృందం

మాకవరపాలెం,మార్చి 11 : ఇక్కడి అవంతి ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి హర్షివ్ కార్తీక్ దర్శకత్వం వహించి, హీరోగా నటించిన మొదటి చిత్రం 'బహుముఖం'లోని తొలి పాటను సోమవారం తాను చదువుకున్న కళాశాలలో అధ్యాపక బృందం ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా విజయవంతం కావాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.ప్రసాద్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గౌరీశ్వరాలయంలో ఘనంగా పుష్పాంజలి





పుష్పాలంకరణలో ఆదిదంపతులు

చోడవరం, మార్చి 11 : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రముఖ స్వయంభూ గౌరీశ్వరాలయంలో సోమవారం పుష్పాంజలి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలోని స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. గౌరీపార్వతి మహిళా మండలి సభ్యులు లలితా, శివ, విష్ణు సహస్రనామాల పారాయణం చేపట్టారు. విప్ ధర్మశ్రీతోపాటు, ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సత్యనారాయణ, ఈవో సత్యనారాయణ, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

'గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తరాదు'

నాతవరం, మార్చి 11 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో జె.రాంబాబు ఆదేశించారు. సోమవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో నీటి సమస్యతో పాటు పారిశుధ్య సమస్యపై ఫిర్యాదులు అందితే వెంటనే స్పందించాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని త్వరగా పూర్తిచేయాలన్నారు. గ్రామ సచివాలయాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రామీణ విస్తరణాధికారి ఎస్‌వీవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా జడ్పీ పాఠశాల వార్షికోత్సవం

రోలుగుంట, మార్చి 11 : మండల కేంద్రం రోలుగుంట జడ్పీ పాఠశాల వార్షికోత్సం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు హెచ్ఎం వరప్రసాద్ దిశా నిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డి.పట్టాలు పంపిణీ

నర్సీపట్నం అర్బన్, మార్చి 11 : రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు ఎమ్మెల్యే గణేశ్ తెలిపారు. సోమవారం ఇక్కడి ఆర్డీవో కార్యాలయంలో పలువురు రైతులకు డి.పట్టాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఆర్డీవో జయరాం, చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండ్ల లాగుడు పోటీ

దేవరాపల్లి, మార్చి 11 : వాకపల్లిలో అభయాంజనేయ తీర్థాన్ని పురస్కరించుకుని సోమవారం ఎడ్లబండ్ల లాగుడు పోటీలు నిర్వహించారు. దేవరాపల్లి అభయాంజనేయ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు.

జుత్తాడ హైస్కూల్‌లో గణిత మేళా

చోడవరం, మార్చి 11 : జుత్తాడ జడ్పీ హైస్కూల్‌లో చెల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి గణితమేళాను నిర్వహించారు. తొలుత ఎంఈవో జయలక్ష్మి ప్రారంభించారు. మండలంలోని 30 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆర్.ఆనందకుమార్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించగా, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ' పథకాల్లో లోపాలపై విచారణ

రోలుగుంట, మార్చి 11 : మండలంలోని 24 పంచాయతీల్లో భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి పథకాల కింద మంజూరైన నిధులపై సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. 2018-19, 2019-20 సంవత్సరాల్లో మండలంలోని ఈ పథకాల కింద 102 మంది లబ్ధిదారులకు నిధులు మంజూరయ్యాయి. కొంతలంలో 2018లో గూడెపు ముసిలినాయుడు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో కార్మికశాఖ నుంచి రూ.5.2లక్షలు మంజూరయ్యాయి. గ్రామానికి చెందిన మధ్యవర్తి కేశరపూడి దుర్గాప్రసాద్ మృతుడి నామినీ అయిన గూడెపు వరహాలను పలుమార్లు బ్యాంకుకు తీసుకువెళ్లి రూ.1.2 లక్షలు మాత్రమే వచ్చాయని చెప్పి నమ్మించి వేలిముద్రలు తీసుకుని, మిగతా రూ.4 లక్షలు స్వాహా చేసినట్టు సామాజిక తనిఖీల్లో గుర్తించారు. అలాగే కుసర్లపూడిలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న గున్నం పెంటయ్య 2018లో సహజమరణం పొందారు. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న పెంటయ్య పేరును కార్మికశాఖలో తప్పుడు ధ్రువపత్రాలతో నమోదు చేసి నామినీ అయిన శ్రీను రూ.50వేలు పొందినట్టు గుర్తించారు. ఆయా నిధుల రికవరీకి కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుజాత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పీ రామారావు, ఆరుగురు డీఆర్పీలు పాల్గొన్నారు.